# 1. అభాసు చేసిన కిట్టుబాటు

"ఏంవాయ్, బావున్నావా?" అని పలకరించాడు సుబ్బారావు రైల్వే వెయిటింగ్ రూంలో కనబడి. కాలేజీలో చదివిన రోజుల్లో నా రచనా వ్యాసంగాన్ని వేళాకోళం చెయ్యడమే అతనికి పని. ఆ రోజుల్లో అయితే స్టూడెంట్స్ యూనియన్ మీటింగుల్లో కూడా రచనలు చేసే నాలాంటి వాళ్లనందర్నీ వరసబెట్టి ఏకిపారేసేవాడు.

కొడవలికీ సిగ్గులేదు కొయ్యగూరకీ లేదన్న ధోరణిలో నేనూ, తారామూర్తీ, గురుప్రసాద్, రామకృష్ణ రాజూ, రాధాకృష్ణారావూ ఇత్యాదులం రచయితలంటే సామాన్య మానవుల కంటే ఎక్కువ అన్న ధోరణిలో, ఉన్నంతలో కాలర్లెత్తుకు తిరిగేసేవాళ్లం.

కాలేజీ మాగజైన్‌కి మా ఇంగ్లీషు మేష్టారు పరమహంసగారు ఎడిటర్. ప్రిన్స్‌పాల్ గారు ఏమైనా అనుకుని పోతారేమోనని చీఫ్ ఎడిటర్: డాక్టర్ యు. రాఘవేంద్రరావు (ప్రిన్సిపాల్) అని అచ్చువేసి అక్కడ కూడా ఆయన ఫొటో వేసేరు. స్టూడెంట్స్ నుంచి, లెక్చరర్స్ నుంచి హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో వ్యాసాలు, కథలు, గేయాలు, టిట్ బిట్స్, సూక్తులు, కార్టూన్‌లు, క్విజ్‌లు ఇలాగ; వెరైటీగా ఎన్నెన్నో సంపాదించడంలో మా చెమట కొంచెం ఖర్చయినా పరమహంసగారి పలుకుబడే ప్రధాన పాత్ర వహించి మేం ఫైనలియర్ చదివిన ఏడాది మేగజైన్‌ని ఒక ఉత్కృష్టమైన సాహితీ సంచికగా రూపొందించ గలిగింది. అలాంటి మేగ్‌జైన్ కాపీని ఈ సుబ్బారావు గాడు పేజి పేజి చింపేసి, చెవుల్లో తిరెట్టుకోడానికి, బెంచీమీద దుమ్ము తుడవడానికి, రాకెట్లు చేసి ఆడపిల్లల మీద వదలడానికీ ఉపయోగించాడని మేం కట్టకట్టుకునెళ్లి పరమహంస మేష్టారితో ఫిర్యాదు చేసేం. ఆయన, టేబుల్ సొరుగులోంచి మాగజైన్ ఇంకో కాపీ తీసి "అభినందనాలతో" అని రాసి సంతకం చేసి "ఇది పట్టుకెళ్లి అతనికియ్యండి" అన్నారు. మాకందరికీ ఏకగ్రీవంగా వొళ్లుమండింది. "మేం ఇవ్వం మేష్టారూ! మీసంతకం ఉంది కదాని వాడు ఈ కాపీ చింపేయక పోయినా దీపావళి ముందర చింపేసి సిసింద్రీలు మతాబాలు కట్టేయడం ఖాయం" అన్నాడు తారామూర్తి.

దేనిమీద శత్రుత్వమో అదే జీవనోపాధిగా అవలంబించవలసి రావడం ఒక్కొక్కసారి జీవితంలో సంభవించి 'ఐరనీ ఆఫ్ లైఫ్' అవుతుంది. పంచదార అంటే వెగటు వాంతీ కలిగే తారామూర్తి సుగర్ టెక్నాలజీ చదివి పంచదార ఫేక్టరీలో ప్రొడక్షన్ మేనేజర్ అయ్యేడు. ఇంగ్లీషు భాషన్నా బ్రిటీషు వాళ్లన్నా కిట్టని సుబ్బారావు ఇంగ్లీషు ఎమ్మే చదివి లెక్చరర్ అయ్యేడు. "రచనా వ్యాసంగం అంటే అసహ్యం కదా; అంచేత కథలూ, నవలలూ రాయి; బాగుపడతావు! " అని నేనొకసారి పేల్చిన జోక్కి, ఇంక్రిమెంటడిగిన గుమస్తా వేపు చూసిన ప్రొప్రయిటర్‌లా నావేపు చూసి, ఒక కేజీ గాలి లోపలికి పీల్చి వదిలాడు.

"ఇంకా కథలూ గట్రా రాస్తున్నావా?" అన్నాడు సుబ్బారావు.

నేను రాయడం బాగా తగ్గించేసేనని తెలిసే అడిగేడని అతని ధోరణిని బట్టి తెలిసిపోయింది. కాని, అడుసు మీద రాయి వేస్తే మొహం మీద తుళ్లుతుందని "ఆ" అన్నాను,

అంటీ అంటనట్టు.

"వృద్ధనారీ పతివ్రతా అన్నట్టు; రాసినన్నాళ్లు రాసి చివరికి వారపత్రికల వాళ్లు పెట్టే పోటీలకి న్యాయనిర్ణేతగా సెటిలయిపోయావు; నాకు తెలీదనుకోకు! అసలు నీలాంటి వాళ్లకు ఇవ్వాలయ్యా; ప్రెయిజులంటూ ఇస్తేను. బైదిబై - చాలా పత్రికలు ప్రయిజులిస్తామని ఎనౌన్స్ చేస్తారే గాని ప్రయిజులు నిజంగా ఇయ్యరుటగా?''

"అబద్ధం! చాలా పత్రికలు నిజంగా ప్రెయిజులిస్తాయి!'' అన్నాను గట్టిగా.

"అదీ నిజమే కావచ్చులే. అంచేత ఈ చిన్నా పెద్దా రచయితలంతా ప్రతి ఒక్కరూ ఎవరికి వారే ఫస్టు ప్రెయిజు పదివేలూ పట్టుకు పోదామనేగా, రాసేది?''

"లేకపోతే ఎవరన్నా సెకండ్ ప్రయిజు కోసమో కన్సొలేషన్ ప్రయిజ్ కోసమో రాస్తారేంటీ?''

"అవునవును, అంచేతనే న్యాయనిర్ణేతగా, ఆ చెత్తా చెదారం చదివినందుకు ఫస్టుప్రయిజ్ కన్నా గొప్పదేదో నీ కియ్యాలంటాను నేను. ఏమంటావు?''

"ప్రెయిజ్ అంటే ప్రెయిజ్ కాదు గానీ ఆనరోరియం అని వందో నూటయాభయ్యో ముట్ట చెబుతూనే ఉన్నారులే.''

"కాని; ఒకనాడు సీరియల్సూ దీపావళి ప్రత్యేక సంచికల్లో కథలూ రాసిన నువ్వు ప్రస్తుతం ఉత్తరాల స్థాయికి దిగిపోయావంటే జాలేస్తోంది నాకు!'' అన్నాడు సుబ్బారావు చాలా వెకిలిగా నవ్వి.

అతనామాట ఎందుకన్నాడో నాకు తెలిసిపోయింది. మొన్నీ మధ్య కొత్తగా పెట్టిన వారపత్రిక 'చిన్న కథలకి' ఐదువేల నుంచి ఐదు వందల వరకూ ప్రయిజు లిస్తామని ప్రకటించగా, అందులో "అభాసు'' అనే రచయిత రాసిన కథకి వెయ్యి రూపాయిల బహుమతి వచ్చింది. ఐదు వేల రూపాయల ప్రయిజు కథా మూడు వేల రూపాయిల ప్రయిజు కథా ప్రారంభ సంచికలో వేసేరు. రెండు వేల ఐదు వందలదీ,రెండు వేలది రెండో సంచికలో వేసేరు. ఆ కథ బావుందని పాఠకులు రాసిన ఉత్తరాలు ఐదో సంచికలో వచ్చేక ఏమిటో చూద్దామని పాత సంచికలు (వార పత్రికలతో వచ్చే చిక్కే ఇది! సీరియల్స్ తప్పించి మిగిలినవన్నీ ఒక్క వారంతో పాతబడి పోతాయి!) తెప్పించి చూశాను.

కథా వస్తువు సరికొత్తది. ఎంత కొత్తదీ అంటే భారతీయ సంస్కృతిలో పడికొట్టుకు లాడుతున్న ఏ సృజనాత్మక దుర్జనాత్మక రచయిత కూడా అంత "నేస్టీ''గా ఆలోచించలేడు. అంత జుగుప్సాకరంగా ఉన్న ఆ కథలో చెప్పలేనంత కొత్తదనం ఉంది. రచనా విధానం చాలా చవకబారుగా అమెచూరిష్‌గా వుంది. కథ మొత్తం మీద రసాత్మకమైన వాక్యం ఒక్కటంటే ఒక్కటి లేదు. కాని ఈ లోపం అంతా కథలో ఉన్న కొత్తదనపు తళుకులో స్ఫురించదు. ఆ కథేగాని మరి కొంచెం బాగా రాస్తే అసలు వెయ్యేమిటి, ఐదువేల రూపాయిల ప్రయిజూ ఇచ్చేయొచ్చేమోనని న్యాయనిర్ణేత మనస్తత్వంతో అలా అలా కథ రెండో మాటు చదివేసరికి ఇంకేముంది; అసలు రహస్యం బైట పడిపోయింది. ఈ కథ ఒక ఇటాలియన్ కథకి కాపీ. "చిన్నకథ - యూరోపియన్ పెనోరమా'' అనే పేరుతో ఐదారేళ్ల కిందట వచ్చిన ఇంగ్లీషు కథా సంకలనంలో యూరపులో ఉన్న అన్ని భాషల్లోని కథల్తో పాటుగా దీని అమ్మ (మాతృక) ఉంది.

'అమ్మ'దొంగా- అని వెంటనే ఇన్‌లాండ్ లెటర్ తీసి ఎడిటర్ పేరిట ఒక ఘాటైన ఉత్తరం రాసేను. అది, ఆ పత్రిక వారు అచ్చువేసి ఉంటారు, నేనింకా చూడలేదు; సుబ్బారావు చూసుంటాడు.

నేనీ జ్ఞాపకాల్లో ఉండగా సుబ్బారావు తన బ్రీఫ్ కేస్ తో చిన్న కుస్తీ పట్టీ అందులోంచి ఆ వారపత్రిక వచ్చేవారం సంచిక లాగాడు. (చాలా పత్రికలు అడ్వాన్స్ డేట్‌తో వస్తాయి; పోస్ట్‌డేటెడ్ చెక్స్‌లాగా) చక చకా పేజీలు తిరగేసి ఓ చోట ఆగేడు.

నా ఉత్తరం పత్రికలో అచ్చుకావడం విశేషం కాదు. ఐతే, ఈ వారంతో మొదలెట్టి ఒక కొత్తరకం ఉత్తరాల శీర్షిక ప్రారంభం కావడం విశేషం. (మీ- మా- వారపత్రిక ముఖచిత్రం కన్నుల పండువుగా యున్నది. కథలన్నీ ఇంపుగా సొంపుగా యున్నవి. సీరియల్స్‌లో సస్పెన్స్ చూస్తే మిమ్మల్నీ ఆ రచయితల్నీ చంపేద్దామన్నంత కసిగా ఉంది - మొదలైన కేటలాగ్ ఉత్తరాలు కావు అవి.) దీనికి సంపాదక వర్గం వారు "నివేదన"అని పేరు పెట్టేరు. ఇది ఈ వారం నుంచే కాకతాళీయంగా (చక్కని ఉత్తరాలు రావడంతో) ప్రారంభమైందట. తమ పత్రికలో ఏదైనా రచన పూర్తి అయ్యేక దాన్ని సమగ్రంగా వివేచనాత్మకంగా విమర్శించే చిట్టి పొట్టి వ్యాసాలకు వారం వారం రెండు వందల రూపాయలనుంచి యాభై రూపాయలు వరకూ ఐదు బహుమతు లట.

అందులో నా ఉత్తరం మొదటి బహుమతికి ఎన్నికైంది!

నేను గర్వంగా చిరునవ్వు నవ్వేనే కాని అతన్ని పట్టించుకోలేదింక. నా ఉత్తరాన్ని యధాతథంగా వేసేరా లేక కత్తిరించారా అని పరీక్షగా చూసుకొంటూ ఆ ఉత్తరం సంపాదక వర్గంలో ఒక గొప్ప ఐడియాని సృజించినందుకు అభినందన లందజేసుకున్నాను.

అలా రైలొచ్చే వరకు మాటాడనని భయపడ్డ వాడిలాగా, సుబ్బారావు నాచేతుల్లోంచి ఆ పుస్తకం లాగేసుకొన్నాడు. టాపిక్ మార్చి "చక్రమందిరం- సినిమా చూసేవా?" అన్నాడు.

"చూళ్లేదు. ఏం?"

"దానికి కధా మాటలూ రాసింది నేనే. ఇరవై వేలిచ్చేరు."

అసూయపడినా తెలియనివ్వకుండా "మైగుడ్నెస్! కంగ్రాచ్యులేషన్స్" అన్నాను.

"సిగ్గుల చిలక- సినిమా చూసేవా, పోనీ? దానికీ కథా మాటలూ నేనే రాశాను. ఐతే ఓ కారణం వల్ల అది ఇంకొకరి పేరుతో వెళ్లిపోయింది. ముప్ఫైవేలిచ్చారనుకో-"

నా అసూయ రెట్టింపైంది, అయినా "గ్రేట్!" అన్నాను, సుబ్బారావు జెబ్బనొక్కి.

"అన్నీ యూరోపియన్ కథలే. నాప్రతాపం ఏం లేదు. ఇప్పుడు ఈ బహుమతి కథ కూడా నువ్వన్నట్టు ఇటాలియన్ కథే. మనకి పనికొచ్చేది ఏదేశంలో ఉన్నా తెచ్చేసుకుంటాం, అంతే! దీనిమీద ఇంపోర్ట్ నిబంధనల్లేవు, నీకు తెలీదేమో!"

"అంటే?" అన్నాను తెల్లమొహం వేసి.

"అభాసు అంటే నేనే. ఆ ఇటాలియన్ కథ నువ్వూ చదివావు, నేనూ చదివాను. నాకు వెయ్యి రూపాయలు కిట్టింది. నీకు రెండు వందలే గిట్టింది!" అన్నాడు నామిత్రుడు అడపాక భాస్కర సుబ్బారావు.

★